సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 31 । ఆగస్టు । 2025



సమష్టి కృషితో..

కామారెడ్డిలో వరదలతో సంభవించిన విపత్కర పరిస్థితినుంచి సమష్టి కృషితో బయటపడ్డామని ఎమ్మెల్యే కేవీఆర్ పేర్కొన్నారు.

- 8లో ▸



అంచనాలు రూపొందిస్తాం

జిల్లాలో వర్షాలు, వరదలతో వాటిల్లిన నష్టంపై అంచనాలు రూపొందిస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.8 /22.1

వాతావరణం

ఉదయం చల్లటి గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'రైతులు ముద్దాయిలుగా తలదించుకోవాల్సి రావడం బాధాకరం'



బిచ్కుంద : అన్నం పెట్టే రైతులు కొందరు జూదం ఆడుతూ పోలీసులకు పట్టుబడి ముద్దాయిగా తలదించుకోవాల్సి రావడం బాధాకరమని బిచ్కుంద జూనియర్ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి వినిల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కోర్ట్ ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూదంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో టైంపాస్ కోసం కొందరు, వ్యాసనాలకు బానిసై ఇంకొందరు జూదం ఆడుతున్నారన్నారు. పేకాటతో దుష్పరిణామాలు ఎదురవుతాయన్నారు. మొదటిసారి జూదం ఆడుతూ పట్టుబడ్డ వారికి జరిమానా విధిస్తున్నామన్నారు. మళ్లీమళ్లీ పట్టుబడేవారికి జరిమానా విధించడంతో పాటు జైలుకు పంపుతామని హెచ్చరించారు. దైవభక్తి పెంపొందించుకొని మంచి మార్గంలో సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మోహన్‌రెడ్డి, న్యాయవాదులు లక్ష్మణ్‌రావు, మల్లేశ్వర్, మహమ్మద్, కోర్టు సిబ్బంది సుదర్శన్‌గౌడ్, శ్యాం, మహేందర్ పాల్గొన్నారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి



మాచారెడ్డి : అక్కాపూర్ శివారులో మరోసారి చిరుత కలకలం సృష్టించింది. శనివారం వేకువజామున ఓ లేగదూడపై దాడి చేసింది. దీంతో అక్కాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అక్కాపూర్‌కుచెందిన దుద్దల రాములు అనే రైతు తన పశువులను చేను వద్ద కట్టేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వెళ్లేసరికి లేగదూడ చనిపోయి ఉండడంతో అధికారులకు సమాచారం అందించాడు. మాచారెడ్డి ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌వో రమేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి ట్రాక్ కెమెరాలను అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో పంట చేలు ఉన్న రైతులు జాగ్రత్తగా ఉండాలని, పశువులను చేను వద్ద కట్టేయవద్దని సూచించారు.

'పకడ్బందీగా చేపట్టాలి'

నాగిరెడ్డిపేట : పోచారం ప్రాజెక్టులోని నీటిని సంరక్షించేందుకు మరమ్మతులను పకడ్బందీగా చేపట్టాలని ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్(సీఈ) శ్రీనివాస్ సూచించారు. ఆయన శనివారం తాత్కాలిక మరమ్మతులను పరిశీలించారు. మరమ్మతులపై స్థానిక ఇరిగేషన్ అధికారులకు సూచనలు ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ ముగిసిన తర్వాత ప్రాజెక్టు వద్ద కోతకు గురైన ప్రాంతంలో శాశ్వత మరమ్మతులు చేపడతామని పేర్కొన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎస్ఈ మల్లేశ్, డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ అక్షయ్‌కుమార్ ఉన్నారు.



లింబూర్ శివారులో కుళ్లిపోయిన సోయా పంట



బీబీపేటలో పొలంలోకి కొట్టుకువచ్చిన బ్రిడ్జికి సంబంధించిన రాళ్లు, ఇసుక



తిమ్మారెడ్డి శివారులోని పొలంలో ఇసుక మేటలు



వరద నీటికి మట్టికట్ట కొట్టుకుపోవడంతో ఖాళీ అయిన కల్యాణి ప్రాజెక్టు

రెక్కల కష్టం మట్టిపాలు

బోరుమోటారు కొట్టుకుపోయాయి



వరద తాకిడికి పంట పొలంలో ఉన్న బోరు మోటారు కొట్టుకుపోయింది. స్టార్టర్ డబ్బా మాత్రమే మిగిలింది. ప్రాజెక్టు కట్ట కొట్టుకుపోవడంతో వల్ల నష్టపోయిన రైతులను సర్కారు ఆదుకోవాలి.

- బాలరాజు, రైతు, అన్నాసాగర్



తిమ్మారెడ్డి శివారులో రాళ్ల తెట్టెగా మారిన పొలం

- విధ్వంసం సృష్టించిన వరద
- సాగుమడిలో ఇసుకమేటలు
- కొట్టుకుపోయిన పంటలు..
- కన్నీటి పర్యంతమవుతున్న రైతులు
- ఆదుకోవాలని వేడుకోలు

జిల్లాను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. పోటెత్తిన వరదలు సాగుమడులను ఇసుక దిబ్బలుగా మార్చాయి. వారం క్రితం వరకు కళకళలాడిన పంటలు.. ఇప్పుడు కళావిహీనంగా తయారయ్యాయి. దీంతో అన్నదాత కంట కన్నీరు వరదై పారుతోంది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : భారీ వర్షాలతో ముంచెత్తిన వరదలు పొలాల్లో విధ్వంసం సృష్టించాయి. నీట మునిగిన పంటలు ఒకవైపు.. వరదలతో కొట్టుకుపోయిన పంటలు, ఇసుక మేటలు వేసిన పొలాలను చూసి రైతన్న గుండె కోతకు గురవుతున్నాడు. జిల్లా అంతటా కురిసిన భారీ వర్షాల మూలంగా వివిధ ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నాశనమయ్యాయి. కొన్ని గ్రామాల్లోనైతే పంటలు తుడిచిపెట్టుకుని పోయాయి.

ఎకరాకు రూ. 20 వేలపైనే నష్టం..

పంటల సాగుకోసం రైతులు ఇప్పటివరకు ఎకరాకు రూ. 20 వేలపైనే ఖర్చు చేశారు. దున్నకాలు, విత్తనాలు, ఎరువులు, నాట్లు, కలుపులు తీయడం వంటి పనులకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారు. భారీ వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతినడంతో ఆందోళన చెందుతున్నారు. కొన్ని రోజులలో సోయా, పెసర, మినుము నూర్పిళ్లకు వచ్చేదని, వర్షాలతో తీవ్రంగా నష్టపోయామని బిచ్కుంద మండలంలోని ఖద్గాం, శెట్లూర్, మిషన్ కల్లాలి, గుండెకల్లూర్, పుల్కల్, సిర్‌సముందర్, దేవాడ, దడ్గి గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు మీదపడడంతో రైతన్నలు బోరుమంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కల్యాణి కట్ట కొట్టుకుపోవడంతో..

ఎల్లారెడ్డిరూరల్ : కల్యాణి ప్రాజెక్టు కింద తిమ్మారెడ్డి, కల్యాణి, అన్నాసాగర్, ఆజామాబాద్ తదితర గ్రామాలలో వేలాది ఎకరాల ఆయకట్టు ఉంది. ఇటీవలే వరి పొట్టదశకు వచ్చింది. నెల రోజులైతే పంట కోతకు వచ్చే తరుణంలో కురిసిన భారీ వర్షాలతో పలు గ్రామాల చెరువులు తెగిపోయి కల్యాణి ప్రాజెక్టులోకి భారీ వరద వచ్చింది. ప్రాజెక్టు సిబ్బంది సకాలంలో వరద గేట్లను ఎత్తకపోవడంతో ఎగువ భాగంలో పంట నీటమునిగింది. తర్వాత కట్ట కోతకు గురి కావడంతో కిందిభాగంలో పంటలు కొట్టుకుపోయాయి. వరద ఉధృతికి ఇసుక మేటలు వేశాయి. రాళ్లు కొట్టుకువచ్చి పొలాల ఆనవాళ్లు లేకుండా పోయాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ప్రాణాలకు తెగించి తాడు సహాయంతో గేట్లను ఎత్తడంతో ఎగువ భాగంలో ఉన్న వరద నీరు తగ్గిందని, లేని పక్షంలో ఇంకా భారీ నష్టం సంభవించి ఉండేదని రైతులు పేర్కొంటున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

76,984 ఎకరాలలో నష్టం..

జిల్లాలో 5,34,569 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంతా బాగుందని అనుకున్న సమయంలో ఒక్కసారిగా విరుచుకుపడిన వర్షం రైతులను ఆగం జేసింది. రెండు రోజులపాటు కురిసిన భారీ వర్షాలతో వాగులు పొంగి ప్రవహించాయి. మంజీర పరవళ్లు తొక్కింది. నిజాంసాగర్, పోచారం, కౌలాస్ ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటలన్నీ పొంగిపొర్లాయి. దీంతో చాలాచోట్ల పంట పొలాల్లో నీరు నిలిచిపోయి దెబ్బతిన్నాయి. మరికొన్ని చోట్ల ఇసుక మేటలు వేశాయి. చాలాచోట్ల పంటలు వరదల తాకిడితో కొట్టుకుపోయాయి. నదులు, వాగు పరీవాహక ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

నీళ్లు ఆగడంతో బిచ్కుంద ప్రాంతంలో పెసర, మినుము, సోయా మొక్కలు కుళ్లిపోతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 76,984 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 410 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. దాదాపు 54,223 మంది రైతులు నష్టపోయారు. అయితే ఇంకా చాలాచోట్ల పంటలు దెబ్బతిన్నాయని, పూర్తి స్థాయిలో క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపితే పంట నష్టం పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.



లింగంపేట: పాములవాగు వంతెనకు తాత్కాలిక మరమ్మతులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

ప్రభుత్వం సహాయం అందించాలి



అప్పులు చేసి పంటలు సాగు చేశాం. భారీ వరదలతో నా పొలం కోతకు గురై ఇసుక దిబ్బలు ఏర్పడ్డాయి. దీంతో చేతికి చిట్టెడు గింజలు రాని పరిస్థితి ఉంది. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలి. – రాజు, రైతు ఖద్గాం

రాళ్లతెట్టెలు వేశాయి



కల్యాణి ప్రాజెక్టుకు సంబంధించిన మట్టి కట్టలు తెగిపోవడంతో రాళ్లు కొట్టుకొచ్చాయి. పంట కొట్టుకుపోయి రాళ్ల తెట్టెలు మిగిలాయి. ఓవైపు పంట నష్టం.. మరోవైపు రాళ్లను తీయాల్సిన పరిస్థితితో మరింత భారం పడింది. – నర్సింహారెడ్డి, రైతు, తిమ్మారెడ్డి

మైదానంగా మారింది



కల్యాణి ప్రాజెక్టుకు భారీ వరద రావడం, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి గేట్లను ఎత్తకపోవడంతో కట్ట కొట్టుకుపోయింది. దీంతో కిందనున్న పొలాల రూపురేఖలు మారాయి. పొలాలు మైదానాలయ్యాయి.

– సంజీవరెడ్డి, రైతు, తిమ్మారెడ్డి

కదిలిస్తే కన్నీళ్లే..!



■ నరేందర్ కుటుంబం కామారెడ్డిలోని జీఆర్ కాలనీలో నివసిస్తోంది. దుస్తులు కుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన కూతురు నందన ఇటీవలే ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు హాజరయ్యింది. సర్టిఫికెట్లు తీసుకువెళ్లడానికి కామారెడ్డికి వచ్చింది. ఇంతలోనే ఒక్కసారిగా వచ్చిన వరదలతో ఇంట్లోకి నీరు చేరి సర్టిఫికెట్లు తడిసి ముద్దయ్యాయి. అలాగే ఆయన కుమారుడు నాగేశ్వర్ డిగ్రీ సర్టిఫికెట్లు సైతం తడిసిపోయాయి. దీంతో ఆ కుటుంబం ఆవేదన చెందుతోంది.



హౌసింగ్ బోర్డ్ కాలనీలో బయటపెట్టిన సామగ్రి

- భారీ వరదల ప్రభావం నుంచి కోలుకోని బాధితులు
- తీవ్రంగా నష్టపోయామని ఆవేదన
- మూడు రోజుల తర్వాత జీఆర్ కాలనీ, హౌసింగ్ బోర్డులకు విద్యుత్ సరఫరా

కామారెడ్డి టౌన్: మునుపెన్నడూ లేని విధంగా జిల్లాకేంద్రంలో ఒక్కసారిగా ముంచెత్తిన వరదలు.. పలు కాలనీల ప్రజలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. నాలుగు రోజులు గడిచినా ఆనాటి వరద బీభత్సాన్ని మర్చిపోలేకపోతున్నారు. బాధితులను కదిలిస్తే కన్నీళ్లు సమాధానంగా వస్తున్నాయి. బుధవారం ఉదయం ఒక్కసారిగా వచ్చిన వరదలతో పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, జీఆర్ కాలనీలు నీట మునిగిన విషయం తెలిసిందే. జీఆర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కౌండిన్య ఎన్‌క్లేవ్‌లలో 100కు పైగా ఇళ్లు వరద నీటిలో మునిగిపోయాయి. వరదతో కోలుకోలేని విధంగా దెబ్బతిన్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వదలని బురద

జీఆర్ కాలనీ, హౌసింగ్‌బోర్డులోని కౌండిన్య ఎన్‌క్లేవ్ వాసుల కష్టాలు కంటిన్యూ అవుతున్నాయి. వరద తగ్గి మూడు రోజులవుతున్నా ఇంకా బురద కష్టాలు తీరడం లేదు. ఇళ్లలోకి చేరిన బురదను తొలగించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. బురదతె తడిసి ముద్దయిన సామగ్రి అంతా చెత్త కుప్పల్లో వేస్తున్నారు. వరదలో సుమారు 18 కార్లు కొట్టుకుపోయాయి. పాక్షికంగా పలు ఇండ్లు ధ్వంసం అయ్యాయి. ఈ రెండు కాలనీలవాసులు నాలుగు రోజులుగా సరైన తిండి లేక ఇబ్బందులు పడుతున్నారు. శనివారం స్వచ్ఛంద సంస్థలు భోజనాలు సమకూర్చాయి.



హౌసింగ్ బోర్డు కాలనీలో కొట్టుకువచ్చి పొదల్లో ఆగిన కారు



జీఆర్ కాలనీలోని ఓ ఇంటిలో నిలిచిన బురద

విద్యుత్ సరఫరా పునరుద్ధరించినా..

స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లకు మరమ్మతులు చేసి శనివారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఆదివారం వరకు ఎవరూ స్విచ్‌లను ఆన్ చేయవద్దని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు.

విధిలేక..

కామారెడ్డి అర్బన్ : జిల్లాకేంద్రంలోని జీఆర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కౌండిన్య కాలనీల్లో శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కాలనీలో పలువురు శనివారం ఉపవాసం ఉంటారు. అయితే వరదల కారణంగా కట్టుబట్టలతో మిగిలిన వారు.. రెండు రోజులుగా సరైన తిండిలేక ఇబ్బంది పడుతున్నవారు విధిలేని పరిస్థితిలో ఉపవాసం ఉండలేకపోయారు. దీంతో పలువురు తమ పరిస్థితిని తలచుకుని రోదిస్తూ భోజనం చేశారు. సేవా కార్యక్రమాల్లో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ జైపాల్ రెడ్డి, ప్రతినిధులు శంకర్, కృష్ణహరి, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉపవాసం ఉండలేకపోతున్నందుకు రోదిస్తున్న మహిళ

వారికి వేదన.. వీరికి ఉపాధి

కామారెడ్డి అర్బన్ : వరద సృష్టించిన బీభత్సం నుంచి జిల్లాకేంద్రంలోని జీఆర్ కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీలవాసులు కోలుకోలేకపోతున్నాయి. ఇళ్లలో చేరిన బురదను తొలగించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఇళ్లలోని సామాన్లను అన్నింటిని తీసి బయటపెట్టారు. ఇదే సమయంలో పాత సామగ్రిని కొనుగోలు చేస్తామంటూ కొందరు తిరుగుతుండడంతో వారు మరింత ఆవేదన చెందుతున్నారు. విలువైన వస్తువులను తుక్కుకింద అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాత సామగ్రి కొనుగోలు చేసేందుకు వ్యాపారి తీసుకువచ్చిన ఆటో

ఒక్కసారిగా వరదొచ్చింది..



ఇంట్లోకి ఒక్కసారిగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులం ఇంటిపైకి వెళ్లాం. వర్షంలో కొంత సమయం గడిపాం. పక్కంటి వాళ్ల కిటికిలోంచి వారింటిలోకి వెళ్లి వాళ్ల వద్ద క్షేమంగా ఉన్నాం. వాళ్లే మాకు తిండి పెట్టారు. విలువైన సర్టిఫికెట్లు, సామాన్లు అన్నీ తడిసిపోయాయి.

– రమేశ్, జీఆర్ కాలనీవాసి

అన్నీ కోల్పోయాం



మా ఇంట్లోనే చిన్న కిరాణం నడుపుకుంటూ జీవిస్తున్నాం. పండుగ రోజు పూజ చేసుకుని రాగానే వరదలు చుట్టుముట్టాయి. ఇంట్లోకి మోకాళ్ల వరకు ఒక్కసారిగా నీళ్లు చేరాయి. బయటకు వచ్చి మెట్లమీద నుంచి పైకి వెళ్లాం. వర్షంలో తడుస్తూ భయపడుతూ గడిపాం. పోలీసులు వచ్చి మమ్మల్ని బయటకు తీసుకెళ్లారు. అన్ని కోల్పోయాం. ప్రభుత్వం ఆదుకోవాలి. – పద్మావతి, నాగేశ్వర్‌రావు దంపతులు, జీఆర్ కాలనీవాసి

14 గంటలు వాటర్ ట్యాంక్‌పైనే...



బుధవారం ఉదయం 10 గంటలకు కాలనీలోని మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్నాం. నాతో పాటు మరో ఇద్దరు ఉన్నారు. ఒక్కసారిగా వరదలు వచ్చాయి. గర్భగుడి నుంచి బయటికి వచ్చేలోపే ఛాతీ వరకు నీరు చేరింది. దీంతో వాటర్ ట్యాంక్ ఎక్కాం. 14 గంటల పాటు అక్కడే ఉన్నాం. రెస్క్యూటీం రాత్రి 12 గంటలకు మమ్మల్ని రక్షించింది.

– సందీప్ పంతులు, హౌసింగ్‌బోర్డు కాలనీవాసి

కళ్లముందే కొట్టుకుపోయాయి



ఉదయం మా ఇంట్లోకి వరద నీరు వచ్చింది. చూస్తుండగానే గొంతు వరకు మునిగాం. ఏం చేయాలో తెలియక ఇంట్లో ఉన్న నలుగురం వెంటనే మొదటి అంతస్తుకు వెళ్లాం. మా కళ్ల ముందు ఇంట్లో సామగ్రి కొట్టుకుపోతున్నా ఏం చేయలేకపోయాం. పోలీసులు, రెస్క్యూటీం వచ్చి సాయంత్రం మమ్మల్ని తరలించారు.

– రాజేశ్వరి, హౌసింగ్‌బోర్డు కాలనీవాసి

క్లుప్తంగా

ఎల్లారెడ్డికి ప్రత్యేక నిధులు కేటాయించాలి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ప్రత్యేకంగా నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో భారీ వర్షాల కారణంగా వరదలు రావడంతో నియోజకవర్గంలోని దాదాపు అన్ని మండలాలలో రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు దెబ్బతినడంతో పాటు, పోచారం ప్రాజెక్టు, కల్యాణి ప్రాజెక్టులకు భారీ ఎత్తున మట్టి కట్ట వరద తాకిడికి కోతకు గురైందని చాలా చెరువుల కట్టలు తెగిపోవడంతో భారీగా వరద నీరు చేరి పంట పొలాలు నీట మునిగి నష్టం జరిగిందన్నారు. నియోజకవర్గానికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని ఆయన సీఎంను కోరారు. సీఎం సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

సామాజిక తనిఖీ మండల సభ

బీబీపేట: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ మండల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ వివరాలను తనిఖీ సిబ్బంది చదివి వినిపించారు. ఆయా గ్రామాల్లో పనుల విషయంలో నిర్లక్ష్యం, హాజరులో తప్పులు చేసిన కార్యదర్శులకు షోకాజు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ఏపీడీ వామనరావు, ఎంపీవో అబ్బాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సెర్ప్ బదిలీలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులందరికీ కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్ తెలిపారు. కౌన్సిలింగ్ ప్రక్రియను శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత 10 సంవత్సరాలుగా డీఆర్‌డీఏలో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులకు బదిలీలు జరగలేదన్నారు. ప్రభుత్వం అనుమతించడంతో ఇటీవల బదిలీల ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. 125 మంది ఉద్యోగులకు కౌన్సిలింగ్‌లో భాగంగా బదిలీలు నిర్వహించినట్లు తెలిపారు. వారికి తొందర్లోనే బదిలీల ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. డీఆర్‌డీవో సురేందర్, సెర్ప్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాణాల రాజిరెడ్డి, యూనియన్ ప్రతినిధులు రాజిరెడ్డి, గంగరాజు, అంజగౌడ్, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన అధికారులకు సన్మానం

కామారెడ్డి క్రైం: పోలీసు శాఖలో శనివారం ఇద్దరు అధికారులు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ రాజేశ్ చంద్ర చేతుల మీదుగా వారిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పోలీసు శాఖలో పని చేసి పదవీ విరమణ పొందుతున్న బిచ్కుంద ఏఎస్సై ఎండి. యూసుఫ్, ఏఆర్ ఎస్సై కె. చంద్రశేఖర్‌ల సేవలు మరువలేనివన్నారు. సీఐలు శ్రీధర్, సంతోష్, నవీన్ కుమార్, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణలో సక్సెస్ అయ్యాం

బాన్సువాడ రూరల్: భారీ వర్షంతో జరిగిన విపత్తు నుంచి ప్రాణనష్టం కలుగకుండా ఎస్‌డీఆర్ఎఫ్ బృందం సక్సెస్ అయ్యిందని సబ్ కలెక్టర్ డా.కిరణ్మయి అన్నారు. శనివారం తన కార్యాలయంలో 17వ బెటాలియన్ ఎస్‌డీఆర్ఎఫ్ బృందాన్ని ఆమె అభినందించారు. భారీ వర్షం, వరదలను లెక్కచేయకుండా కలిసికట్టుగా విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనడంతో అధికారులు కీలకపాత్రం పోషించారన్నారు. తహసీల్దార్ వరప్రసాద్ ఉన్నారు.



అచ్చంపేట, బ్రాహ్మణపల్లి శివారులోని పంటపొలాల్లో ఇసుక మేటలు



చిన్నమల్లారెడ్డి శివారులో వరి పొలంలో వేసిన రాళ్ల మేట

రైతన్నకు కొలుకోలేని నష్టం



ఇస్సన్నపల్లిలో వరి పొలంలో ఇసుక మేట



బండరామేశ్వర్‌పల్లిలో వరిపంటపై ఇసుకమేట



సదాశివనగర్ శివారు తోలుకోని కుంట సమీపంలోని ఓ రైతు పొలంలో ఇసుక మేట

- వరద నీటిలో కొట్టుకుపోయిన బోరుమోటార్లు, ఆవులు
- ఆదుకోవాలని రైతుల వినతి

నిజాంసాగర్/రామారెడ్డి/బీబీపేట/దోమకొండ/సదాశివనగర్/కామారెడ్డి రూరల్/గాంధారి/మాచారెడ్డి : నిజాంసాగర్ మండలంలో మంజీరా నది ప్రవాహానికి పంట పొలాల్లో ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. ఆయా గ్రామాల పరిధిలో దాదాపు 150 ఎకరాల్లో పంట పొలాలను ఇసుక దిబ్బలు కప్పేశాయి. జిల్లాలోని పలు చోట్ల పంట పొలాలు ఇసుక, రాళ్ల డంపులుగా మారాయి. బీబీపేటకు చెందిన దేవునిపల్లి దేవరాజుకు బీబీపేట అయ్యప్ప ఆలయం వద్ద ఒక గుంట భూమి ఉండడంతో అందులో వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ఐదు సంవత్సరాల క్రితం ప్రారంభించాడు. వర్షం కురవడంతో బీబీపేట పెద్ద చెరువు పూర్తిగా నిండి అలుగు పారింది. అలుగు ప్రవహించడంతో దేవరాజు దుకాణం పూర్తిగా కొట్టుకుపోయింది. అలాగే మాణికే రాజు అనే రైతు రెండు ఎకరాల విస్తీర్ణంలో వరి వేశాడు. అలుగు పారడంతో బ్రిడ్జికి సంబంధించిన బండ రాళ్లు, ఇసుక మేటలు పూర్తిగా వరి పొలంలోకి వచ్చి పంట ధ్వంసమైంది. రెండు బోర్లు, స్టార్టర్లు, వైర్లు, ఒక బోరు మోటారు, పైపులు కూడా వరదలో కొట్టుకుపోయినట్లు బాధితుడు తెలిపారు. దోమకొండ మండలం సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన రైతు మన్నె పోశయ్య రేకులషెడ్డు వరదనీటిలో కొట్టుకుపోగా, ఎనిమిది ఆవులు మృతిచెందాయి. దాదాపు రూ.6లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. వర్షాలకు రూ.లక్షల్లో రైతులు నష్టపోయారు.



సంఘమేశ్వర్ గ్రామ శివారులో కొట్టుకుపోయిన రేకులషెడ్డు వద్ద రైతు మన్నె పోశయ్య



గుజ్జుల్ డ్యాం ఆయకట్టు కింద వరి పొలంలో వేసి రాళ్ల మేట



బీబీపేటలో దుకాణం వరదలకు కొట్టుకుపోవడంతో బాధితుడు దేవునిపల్లి దేవరాజు

యూరియా కోసం యుద్ధమే..



రామారెడ్డి సొసైటీ దగ్గర యూరియా కోసం బారులు తీరిన రైతులు

- రామారెడ్డిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు
- క్యూలైన్లో సొమ్మసిల్లిన మహిళ



యూరియా పంపిణీ దగ్గర మహిళల తోపులాట

రామారెడ్డి: రైతులు ఒక్క యూరియా బస్తా కోసం యుద్ధమే చేయాల్సి వస్తోంది. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలో వడ్లూరు ఎల్లారెడ్డి సింగల్ విండో ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం పక్కన శనివారం రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నారు. అప్పటికే రైతులు రెండు గంటలకు పైగా క్యూలైన్లో బారులు తీరారు. క్యూలైన్‌లో నిలబడ్డ మహిళలు ఒకరినొకరు తోసుకోవడంతో ఓ మహిళ కింద పడిపోయింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. 440 బస్తాల యూరియా మాత్రమే అందుబాటులో ఉందని ఏవో భానుశ్రీ తెలిపారు. క్యూలైన్లో మాత్రం వెయ్యి మందికి పైగా రైతులు యూరియా కోసం వేచి చూస్తున్నారు. ప్రభుత్వం యూరియాను రైతులకు కావాల్సినంత సరఫరా చేయాలని రైతులు కాసేపు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం స్పందించి రైతులకు కావలసిన యూరియాను అందించాల్సిన బాధ్యత ఉందని బీఆర్ఎస్ నాయకులు అక్కడే ధర్నాకు దిగారు. అనంతరం పోలీసుల పర్యవేక్షణలో రైతులకు ఉన్న యూరియా బస్తాలను పంపిణీ చేశారు.


70 ఏళ్ల వయసులో రెండు గంటలు లైన్ కట్టిన..



నాకు మూడు బస్తాల యూరియా కావాలని 70 ఏళ్ల వయసులో రెండు గంటలకు పైగా లైన్లో నిలబడిన తీరా లైన్ వచ్చేసరికి జిరాక్స్ కావాలన్నారు. మళ్లీ జిరాక్స్ సెంటర్ కు వచ్చి జిరాక్స్ తీసుకెళ్లాను. అప్పటికే యూరియా బస్తాలు అయిపోయాయి.
– లక్ష్మి రైతు, రామారెడ్డి

సమష్టి కృషితో కామారెడ్డిని కాపాడుకున్నాం

- శ్రమించిన అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు
- సోషల్ మీడియా తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: వరదల విపత్కరపరిస్థితి నుంచి కామారెడ్డిని సమిష్టి కృషితో కాపాడుకున్నామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.కామారెడ్డిలో 15 సెంటిమీటర్ల వర్షం పడటంతో 30 మీటర్లు ఉన్న వాగు ప్రవాహం 300 మీటర్లు ప్రవహించిందని ఇలాంటి విపత్కర పతిస్థితి రావడం బాధాకరమన్నారు. బీఆర్‌కాలనీ, హౌజింగ్‌బోర్డు కౌడిన్య కాలనీలో ప్రవాహం ఇళ్లలోకి వరద నీరు చేరడాన్ని వివరించారు. అధికారులు పని చేయలేరని, క్షేత్రస్థాయిలో లేరని కొందరు చేస్తున్న ఆరోపణలు అవాస్తవన్నారు. నియోజకవర్గంలో తీవ్రంగా నష్టం వాటిల్లిందని, అత్యవసరంగా,శాశ్వత పనులకు ఆర్‌అండ్‌బీ రూ. 13.79 కోట్లు, పంచాయతీ రాజ్‌కు రూ.7 కోట్లు, ఇరిగేషన్ శాఖకు రూ. 6కోట్లు, కామారెడ్డి మున్సిపాలిటీకి రూ.30 కోట్లు అవసరమన్నారు. నియోజకవర్గంలో 17,104 ఎకరాల్లో 11843 మంది రైతులు పంట నష్ట పోయారని వివరించారు. జాతీయ రహదారిపై ప్రవాహానికి డివైడర్లు, లైటింగ్ కూలి పోలేవని, కాలనీలో మునిగిపోవద్దని జేసీబీలతో ధ్వంసం చేయాల్సి వచ్చిందన్నారు. తానే రేల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి కూల్చేయించానని చెప్పారు. ఏఎస్పీ చైతన్య రెడ్డి జేసీబీ పైకి ఎక్కి వరద వద్దకు వెళ్లిందని ప్రశంసించారు. పని చేసిన వ్యక్తులను దుర్భాషలాడటం సరికాదన్నారు. ఈ విపత్కర పరిస్థితులకు నాలాలు కబ్జాలు ఆక్రమించి నిర్లక్ష్యంగా నిర్మాణాలు చేసుకోవడమే కారణమన్నారు. రెండు నెలల్లో మొత్తం సర్వే చేయించి ఎంతటి వారి ఇళ్లు ఉన్నా ఆక్రమణలు, కబ్జాలు తొలగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు సేవలందించిన అధికారులకు కృతజ్ఞతలు చెప్పారు.

మాచారెడ్డి : రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. పాల్వంచ మండలంలోని బండరామేశ్వర్‌పల్లి,దేవునిపల్లి గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. వరద తాకిడితో దెబ్బతిన్న పాల్వంచ బ్రిడ్జీతో పాటు బండరామేశ్వర్‌పలి, చుక్కాపూర్ మధ్యన ఉన్న బ్రిడ్జీని పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మాచారెడ్డి, పాల్వంచ మండలాల బీజేపీ నాయకులు సురేశ్, అనిల్, తోట బాల్‌రాజు, బాల్‌చంద్రం, శ్రీనివాస్, ఉన్నారు.

తల్లిదండ్రులకు విద్యార్థుల అప్పగింత



నాగిరెడ్డిపేటలో విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలం లింగంపల్లికలాన్ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు ఈ నెల 27న వినాయకుడి విగ్రహం కోసం వెళ్లి, భారీ వర్షం కారణంగా నాలుగు రోజులుగా మెదక్ జిల్లాలోనే చిక్కుకుపోయారు. వారిని ఎట్టకేలకు శనివారం అధికారులు వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. లింగంపల్లికలాన్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు మరో వ్యక్తితో కలిసి ఈ నెల 27న వినాయకుడి విగ్రహం తెచ్చేందుకు ట్రాక్టర్‌పై మెదక్ జిల్లా హవేలీ ఘణ్‌పూర్‌కు వెళ్లారు. అదే రోజు కురిసిన భారీ వర్షంతో పోచారం ప్రాజెక్టు వరదనీటి తాకిడికి రోడ్డు తెగిపోవడంతో వారంతా మెదక్ జిల్లా పోచమ్మరాల్‌లో తెలిసిన వారింట్లో ఉండిపోయారు. రెండురోజుల తర్వాత విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా అధికార యంత్రాంగం విద్యార్థులను వారి స్వగ్రామానికి పంపేందుకు పోచారం వద్దనున్న వాగును ఆర్మీ సిబ్బంది సహకారంతో దాటించే ప్రయత్నం చేశారు. కానీ వారి ప్రయత్నం విఫలం కావడంతో విద్యార్థులను మెదక్ జిల్లా అధికారులు అక్కడి మెదక్‌లోని పునరావాస కేంద్రానికి తరలించారు. కాగా శనివారం మెదక్ జిల్లా అధికారులు ప్రత్యేక బస్సులో విద్యార్థులను నాగిరెడ్డిపేట తహశీల్ కార్యాలయానికి తరలించి డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్, లింగంపల్లికలాన్ పంచాయతీ కార్యదర్శి వనజ సమక్షంలో వారి తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థులను సురక్షితంగా వారి గమ్యానికి చేర్చిన హవేలీ ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఆకుల గోపాల్‌కు తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అండగా ఉంటాం..అధైర్య పడకండి



బాన్సువాడ రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వారందరికి అండగా ఉంటామని, బాధితులు అధైర్య పడొద్దని ఉమ్మడి నిజామాబాద్ మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సంగోజీపేట్ గ్రామంలో పర్యటించారు. వాగు భారీగా పొంగిపొర్లడంతో సమీపంలోని పంటపొలాల్లో ఇసుక మేటలు వేసి నష్టం జరిగిందన్నారు. సుమారు అరకిలోమీటర్ మేర రోడ్డు ధ్వంసమైందన్నారు. నాయకులు సంగ్రాంనాయక్, మోహన్‌నాయక్, మహ్మద్ ఎజాస్, నార్లసురేష్ గుప్తా, దిల్‌రాజు,జెట్టి హన్మాండ్లు , రాసాలం సాయిలు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హైవేకు మరమ్మతులు ప్రారంభం



కామారెడ్డి జాతీయ రహదారిపై మరమ్మతు పనులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి చెరువు వరద ప్రవాహంతో హౌజింగ్ బోర్డు నుంచి సరంపల్లి వరకు అర కిలోమీటకు వరకు జాతీయ రహదారి ధ్వంసమయ్యింది. సెంట్రల్ డివైడర్‌లు సైతం కొట్టుకుపోయాయి. వరదలు తగ్గడంతో రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారు. ప్రస్తుతం వన్‌వేలో వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి రెండు వైపులా రవాణా సౌకర్యం కల్పిస్తామని పోలీసులు తెలిపారు.

తిమ్మాపూర్ చెరువును పరిశీలించిన ఇరిగేషన్ సీఈ

ఎల్లారెడ్డి : మండలంలోని తిమ్మాపూర్ చెరువును శనివారం ఇరిగేషన సీఈ శ్రీనివాస్ పరిశీలించారు. భారీవర్షాల కారణంగా తిమ్మాపూర్ చెరువుకట్ట తెగిపోవడంతో కట్టప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు పంటలు పండేలా తాత్కాలికంగా చెరువులకు మరమ్మత్తులు చేసే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

నష్టంపై అంచనాలు రూపొందిస్తాం



బొగ్గు గుడిసె వద్ద నష్టం గురించి కలెక్టర్ సంగ్వాన్‌కు వివరిస్తున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి

నాగిరెడ్డిపేట : భారీ వర్షాలతో జరిగిన నష్టంపై సర్వే నిర్వహించి అంచనాలు రూపొందిస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. శనివారం ఆయన పోచారం ప్రాజెక్టు వద్ద జరుగుతున్న తాత్కాలిక మరమ్మతు పనులను, కామారెడ్డి –మెదక్ జిల్లాల సరిహద్దులో వరద తాకిడికి దెబ్బతిన్న జాతీయ రహదారితోపాటు వంతెనను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గరిష్టంగా 70వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోను తట్టుకునే సామర్థ్యం కలిగిన పోచారం ప్రాజెక్టుకు ఈనెల 27న ఒక్కసారిగా 1.82 లక్షల క్యూసెక్కుల నీరు రావడంతో ప్రాజెక్టు అలుగుకు ఒకవైపు మట్టి కొట్టుకుపోయిందన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కాంగ్రెస్ నాయకులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారన్నారు. వరద పూర్తిగా తగ్గిపోయాక శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. జాతీయ రహదారికి మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించాలని నేషనల్ హైవే అధికారులకు ఫోన్‌ద్వారా సూచించారు. ఆయనవెంట ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు, నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు గంగారెడ్డి, రాంచందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిష్టయ్య, విక్రాంత్‌రెడ్డి, శేఖర్, కిరణ్ కుమార్, సురేందర్‌గౌడ్ తదితరులున్నారు.

బొగ్గు గుడిసె వద్ద..

నిజాంసాగర్: వరద ముంపునకు గురైన బొగ్గు గుడిసె చౌరస్తాను శనివారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. వరద నీటిప్రవాహంతో కొట్టుకు పోయిన టిఫిన్ సెంటర్, పంక్చర్ దుకాణంతో పాటు బార్బర్, ల్యాండ్రీ దుకాణాల నిర్వాహకులను పరామర్పించారు. ముంపు బాధితులను ఆదుకుంటామన్నారు. మండల ప్రత్యేకాధికారి అరుణ, తహసీల్దార్ సవాయిసింగ్, ఆర్ఐ పండరి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఉన్నారు.

తక్షణ సహాయం మంజూరు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం పర్యటించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు, తాగు నీరు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను పరిశీలించి వరద బాధితులతో మాట్లాడారు. పాక్షికంగా దెబ్బతిన్న జీఆర్ కాలనీలోని 48 ఇళ్లకు తక్షణ సహాయం కింద రూ.11,500 చొప్పున ఆర్థిక సహాయంతోపాటు నిత్యావసర సరకులు, దుప్పట్లను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. కాలనీలో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయన్నారు. పంట నష్టం వివరాలను వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా సర్వే చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, తహసీల్దార్ జనార్దన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

10 వేల కోళ్లు మృతి



దోమకొండ: మండలంలోని గొట్టుముక్కల గ్రామ శివారులో 10వేల కోళ్లు భారీ వర్షానికి మృతిచెందాయి. గ్రామానికి చెందిన గన్నమనేని పద్మకు ఎడ్లకట్ట వాగు సమీపంలో కోళ్లఫారాలు ఉన్నాయి. గత మూడు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎడ్లకట్ట వాగు సమీపంలోని పంట పొలాల నుంచి నీరు ప్రవహించడంతో కోళ్లఫారాలు మునిగిపోయాయి. శనివారం వరద ఉధృతి తగ్గడంతో కోళ్లఫారాల యజమానులు అక్కడికి వెళ్లి చూడగా, అందులో ఉన్న పదివేల కోళ్లు బురదమట్టిలో కూరుకుపోయి చనిపోయి ఉన్నాయి. వెంటనే విషయాన్ని రెవెన్యూ, వెటర్నరీ అధికారులకు తెలియజేశారు. ఆర్ఐ శ్రీనివాస్, వెటర్నరీ డాక్టర్ శివ అక్కడికి చేరుకుని పంచమానా చేశారు. దాదాపు రూ. 6లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు పద్మ తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆమె కోరారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి



రమేష్(ఫైల్)

బీబీపేట: బీబీపేట పెద్ద చెరువుకు పడ్డ బుంగను పూడ్చడానికి ట్రాక్టర్‌పై బయలుదేరిన డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఉప్పర్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా.. బీబీపేట పెద్ద చెరువు కట్టకు బుంగ పడడంతో ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన మన్నె రమేష్ తన ట్రాక్టర్ ద్వారా మట్టిని గత మూడు రోజులుగా తీసుకెళ్తున్నాడు. శనివారం మట్టిని తరలించే క్రమంలో అకస్మాత్తుగా గుండెలో నొప్పి రావడంతో స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతడు మృతి చెందినట్లుగా తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె..

బీబీపేట: మండలంలోని యాడారం గ్రామంలో కాటేం శ్రీనివాస్‌కు చెందిన గేదె శనివారం సమీపంలోని పొలాల్లో విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఘటన స్థలాన్ని పశు వైద్యాధికారి శివకుమార్, విద్యుత్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గేదె విలువ రూ. లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

బస్సు నుంచి పడి మహిళకు గాయాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్ గ్రామం వద్ద శనివారం ఆర్టీసీ బస్సులోనుంచి ఓ మహిళ పడడంతో గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. లింగంపేటకు చెందిన కొట్టూరి చంద్రకళ శనివారం కామారెడ్డికి బస్సులో బయలు దేరింది. ముస్తాపూర్ గ్రామం వద్ద ఆమె బస్సులోనుంచి ప్రమాదవశాత్తు జారిపడిపోయింది. దీంతో ఆమెకు గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డబుల్ ఉన్న ఓట్లను తొలగించాలని వినతి

నస్రుల్లాబాద్ : మండలంలోని మైలారం గ్రామంలో డబుల్‌ఉన్న ఓట్లను తొలగించాలని బీజేపీ నాయకులు జీపీ కార్యదర్శి సవితకు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా ప్రతి వార్డులో సీరియల్ నెంబరు ప్రకారం ఓట్లు ఉండాలని, జాబితాలో మరణించిన వారి పేర్లను తొలగించాలని కోరారు. బీజేపీ నాయకులు వడ్ల సతీష్,టి.శేఖర్,సాయిలు తదితరులున్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

బాన్సువాడ: బీర్కూర్‌లోని కాలబజార్ గల్లీలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాజశేఖర్ శనివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు గల్లీలోని పేకాట స్థావరంపై దాడి చేసి, వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3080 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

రోడ్డు విస్తరణపై వరద ప్రభావం

- కోతకు గురైన కల్వర్టులు, రోడ్లు
- కొట్టుకుపోయిన సామగ్రి



వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన కొత్త రోడు

నిజాంసాగర్: వర్షాలు, వరదలు ఎన్‌హెచ్ 765 డి రహదారి విస్తరణ పనులకు అడ్డంకిగా మారాయి. మహమ్మద్‌నగర్, నర్వ, బొగ్గుగుడిసె చౌరస్తా ప్రాంతాల్లో ప్రధాన రహదారి కోతకు గురవడంతో పాటు కల్వర్టుల వద్ద గండ్లు పడ్డాయి. కల్యాణి వాగుపై కొత్తగా నిర్మిస్తున్న కల్వర్టుతో పాటు కొత్తగా వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న సంస్థకు సంబంధించిన ట్యాంకర్ నీటమునిగింది. ఇనుపరాడ్లు, యంత్ర పరికరాలు, సామగ్రి వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. బాన్సువాడ – ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డు పలు చోట్ల కోతకు గురవడంతోపాటు కల్వర్టులకు గండ్లు పడి ప్రమాదకరంగా మారాయి. ప్రధాన రహదారిపై ఏర్పడిన గండ్లకు తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నారు.

బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు కుట్ర

బాన్సువాడ : బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు కుట్ర జరుగుతోందని బంజార సేవ సంఘం మాజీ మండల అధ్యక్షులు రాము రాథోడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బంజారులు కష్టాన్ని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నారని, అన్ని రకాలుగా అభివృద్ధి చెందారని, కొందరు కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. బంజారులకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు.